

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

అవిశ్వాసానికి సై



- బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్ల సన్నాహాలు
- కాంగ్రెస్ కార్పొరేటర్ల మద్దతు కోసం మంతనాలు
- సుధారాణిపై కాంగ్రెస్ నేతల్లోనూ అగ్రవేశాలు
- అవిశ్వాసంలో పాల్గొనొద్దని అధిష్ఠానం హుకుం
- ఎటూ తేల్చుకోలేకపోతున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు
- రసవత్తరంగా మారిన నగర రాజకీయాలు
- నేడు జీడబ్ల్యూఎంసీలో బడ్జెట్‌తో పాటు వరదలపై సమావేశం

గ్రేటర్ వరంగల్ మేయర్‌పై అసంతృప్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణిపై అవిశ్వాస కత్తి వేలాడుతోంది. పార్టీ మారినప్పటికీ మేయర్‌పై కార్పొరేటర్లలో అసమ్మతి తగ్గలేదు. మేయర్ సుధారాణిపై బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారు. అయితే అవిశ్వాసం కోసం ఇచ్చే నోటీసులో సగానికి పైగా సభ్యుల మద్దతు అవసరం కావటంతో మేయర్ వైఖరిపై అసంతృప్తిగా ఉన్న కొంతమంది కాంగ్రెస్ కార్పొరేటర్లతో బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు రహస్య మంతనాలు చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం అవిశ్వాసంలో పాల్గొనవద్దని కాంగ్రెస్ కార్పొరేటర్లపై ఒత్తిడితేస్తోంది. దీంతో కాంగ్రెస్ కార్పొరేటర్లు ఏటూ తేల్చుకోలేకపోవటం ఉత్కంఠగా మారింది. మరోవైపు బీఆర్‌ఎస్ నుంచి గెలిచి మేయర్‌గా ఎన్నికైన గుండు సుధారాణి కాంగ్రెస్‌లో చేరటంతో పార్టీ ఫిరాయింపుల చట్టం కింద సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీఆర్‌ఎస్ నేతలు హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి విజ్ఞప్తి చేయటం చర్చనీయాంశంగా మారింది.

జీడబ్ల్యుఎంసీలో కాంగ్రెస్ పట్టు

గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యుఎంసీ)లో అసెంబ్లీ ఎన్నికల తరువాత బలబలాలు భారీగా మారాయి. జీడబ్ల్యూఎంసీలో మొత్తం 66 డివిజన్‌లో ఉన్నాయి. 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 48స్థానాల్లో విజయం సాధించగా, బీజేపీ 10 స్థానాల్లో, కాంగ్రెస్ 4స్థానాల్లో, ఇతరులు 4స్థానాల్లో విజయం సాధించారు. కొద్ది నెలలకే ఇతర పార్టీలు, ఇండిపెండెంట్‌లుగా గెలిచిన నలుగురు కార్పొరేటర్లతో పాటు బీజేపీకి చెందిన మరో కార్పొరేటర్‌తో మొత్తం ఐదుగురు బీఆర్‌ఎస్‌లో చేరటంతో ఆ పార్టీ బలం 53కు చేరగా, బీజేపీ 9, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు మిగిలారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోవటంతోపాటు గ్రేటర్ వరంగల్ పరిధిలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే విజయం సాధించారు. దీంతో గ్రేటర్‌లో ఆ పార్టీ బలపడటంపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ నుంచి 29 డివిజన్ కార్పొరేటర్‌గా గెలిచిన గుండు సుధారాణి మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సొంత పార్టీ నేతలే ప్రయత్నాలు మొదలు పెట్టారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నేతృత్వంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు గుండు సుధారాణిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మేయర్‌పై అసంతృప్తితో చాలామంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. దీంతో నలుగురు ఉన్న కాంగ్రెస్ బలం 30కి పైగా చేరింది. అయితే అనుహ్యంగా మేయర్ గుండు సుధారాణి సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపారు. అంతేకాకుండా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. అయితే సుధారాణి చేరికపై కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లతో పాటు మంత్రి కొండా సురేఖ, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా అనుహ్యంగా లోక్‌సభ ఎన్నికల సమయంలో గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమక్షంలో మేయర్ కాంగ్రెస్‌లో చేరారు. మేయర్‌తోపాటు మరికొంత మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువా కప్పుకోవటంతో కార్పొరేషన్‌లో కాంగ్రెస్ బలం 34కు చేరింది. బీఆర్‌ఎస్‌కు 21 మంది, బీజేపీకి 11మంది సభ్యుల బలం చేకూరింది.

అవిశ్వాసానికి ఎత్తులు

కాంగ్రెస్‌కు జీడబ్ల్యూఎంసీలో పూర్తిస్థాయిలో మెజారిటీ ఉంది. 34మంది సభ్యులతో పాటు ఐదుగురు ఎక్స్ అఫీషియో సభ్యుల అండ కూడా ఉంది. కానీ, చాలామంది కాంగ్రెస్ కార్పొరేటర్లు మేయర్‌పై అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు మేయర్ గుండు సుధారాణిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నారు. గురువారం కార్పొరేషన్ బడ్జెట్‌తో పాటు అభివృద్ధిపై చర్చించేందుకు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా మేయర్‌పై అవిశ్వాసం అంశం తెరపైకి వచ్చింది. మంగళవారం కార్పొరేషన్‌లోని సమావేశ మందిరంలో బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సమావేశం అయ్యారు.

కాగా, కార్పొరేషన్‌లో బీఆర్‌ఎస్‌కు నలుగురు ఎమ్మెల్సీలు, కాంగ్రెస్‌కు ఒక ఎంపీ, నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. అంటే 10 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో పాటు 66 మంది కార్పొరేటర్లతో 76మంది సభ్యులు ఉంటారు. అయితే మేయర్‌పై అవిశ్వాసానికి నోటీసులు ఇచ్చేందుకు కనీసం 39మంది సభ్యుల మద్దతు అవసరం. కానీ ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు 21మంది సభ్యులతో పాటు నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు కలిపి మొత్తం బలం 25 ఉంటుంది. అలాగే బీజేపీకి 11 మంది సభ్యులు ఉన్నారు. ఈ రెండు పార్టీల బలం 36 కాగా, ముగ్గురు మద్దతు అవసరం అవుతుందని అంచనా వేస్తున్నారు. దీంతో మేయర్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్న 8మంది కాంగ్రెస్ కార్పొరేటర్లతో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నేతలు రహస్య మంతనాలు చేస్తున్నారు. ఈ 8మంది కాంగ్రెస్ కార్పొరేటర్లు అవిశ్వాసానికి అనుకూలంగా మారితే మేయర్ పీఠం చేజారినట్టేననే చర్చ జరుగుతోంది.

నలుగుతున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు

మేయర్ గుండు సుధారాణిపై అవిశ్వాసంలో కొంతమంది కాంగ్రెస్ కార్పొరేటర్లు నలిగిపోతున్నారు. సొంతపార్టీలో మేయర్ తీరు నచ్చకనే సుమారు 30మంది కార్పొరేటర్లలో అత్యధికులు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరి బీఆర్‌ఎస్ మేయర్‌పై అవిశ్వాసం పెట్టి, గ్రేటర్‌ను హస్తగతం చేసుకోవాలని వ్యూహరచనలు చేశారు. అయితే మేయరే కాంగ్రెస్ గూటికి చేరటంతో కార్పొరేటర్ల పరిస్థితి ఇరకాటంలో పడింది. ప్రస్తుతం కాంగ్రెస్ మేయర్‌గా గుండు సుధారాణి కొనసాగుతుండటంతో సొంతపార్టీ మేయర్‌పై అవిశ్వాసానికి అధిష్ఠానం ససేమేరా అంటోంది. అంతేకాకుండా బీఆర్‌ఎస్, బీజేపీలతో కలిసి మేయర్‌పై అవిశ్వాసానికి వెళ్లొద్దని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో మేయర్‌పై అసంతృప్తి.. అధిష్ఠానం ఆదేశాల మధ్య కాంగ్రెస్ కార్పొరేటర్లు కొందరు నలిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో మేయర్‌పై అవిశ్వాసానికి కాంగ్రెస్ కార్పొరేటర్లు మద్దతు ఇస్తారా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది.

కార్పొరేటర్ సుధారాణి సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- కలెక్టర్‌కు బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల వినతి

హనుమకొండ కలెక్టరేట్, జూన్19: బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి మేయర్ అయిన గుండు సుధారాణి.. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో స్థానిక సంస్థల పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ఆమె కార్పొరేటర్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీఆర్‌ఎస్‌కు చెందిన 22 మంది కార్పొరేటర్లు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రావీణ్యకు వినతపత్రం అందజేశారు. బడ్జెట్ సమావేశాలు నిర్వహించడానికి మేయర్‌కు అర్హత లేదని, బడ్జెట్ సమావేశాలను తమ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కార్పొరేటర్లు పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మసూద్‌తోపాటు కార్పొరేటర్లు మరుపల్ల రవి, బోయినపల్లి రంజిత్‌రావు, డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, పద్మ, స్వరూపరాణి ఇతర బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

- భర్త వివాహేతర సంబంధంతో అవమాన భారం
- పెళ్లయిన మూడు నెలలకే విషాదం



నల్లబెల్లి, జూన్19: పెళ్లయిన మూడు నెలలకే వధువుకు నూరేళ్లు నిండాయి. అగ్ని సాక్షిగా పెళ్లాడిన భర్త మరో అమ్మాయితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో.. భరించలేక పుట్టింటికి వచ్చి బుధవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నల్లబెల్లిలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం. నల్లబెల్లికి చెందిన వీర్ల రమాదేవి, రమేష్ దంపతుల కుమార్తె వైష్ణవి(25)ని, ములుగు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన రెడ్డి శారద, శంకర్ దంపతుల కుమారుడు రెడ్డి పవన్‌కుమార్‌తో 2024 మార్చిలో వివాహం జరిపించారు. తన భర్త ఆయనతో చదువుకున్న అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకొని వైష్ణవిని పట్టించుకొనేవాడు కాదు. నిత్యం అమ్మాయితో సెల్‌ఫోన్‌లో మాట్లాడేవాడు. అర్ధరాత్రి వేళలో ఇంటికి వచ్చేవాడు. ఇదేంటని ప్రశ్నించగా, పొంతనలేని సమాధానాలతో గోల చేసేవాడు. దీంతో భర్త తీరును అత్తమామలకు తెలుపగా, వారు కొడుకుకే మద్దతు పలకడం, తర్వాత అదనపు కట్నం కోసం ఒత్తిడి చేస్తున్నారు. భరించలేక వైష్ణవి తన తల్లిదండ్రులకు విషయాన్ని తెలిపి, నల్లబెల్లిలోని పుట్టింటికి మంగళవారం సాయంత్రం వచ్చింది. రాత్రి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి బోరున విలపించింది. కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా, బుధవారం తెల్లవారు జామున తల్లిదండ్రులు నిద్రలేచి చూసేస రికే ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని వైష్ణవి కనిపించింది. వెంటనే నర్సంపేట ప్రభుత్వ దవాఖానాకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు వెల్లడించారు. దీంతో నల్లబెల్లిలో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి. మృతురాలి తండ్రి వీర్ల రమేష్ ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరేది లేదు

మాజీ మంత్రి దయాకర్‌రావు

పర్వతగిరి, జూన్ 19: బీఆర్‌ఎస్ పార్టీని వీడేది లేదని, కాంగ్రెస్ పార్టీలో చేరేది లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. బుధవారం ఆయన పర్వతగిరి మండలకేంద్రంలోని తన నివాసంలో పాలకుర్తి నియోజకవర్గ ముఖ్యనాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతున్నానని కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు కావాలని పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమలుకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, హామీలు నెరవేర్చలేక ప్రభుత్వం బొక్కబోర్లా పడుతోందని అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన మాయమాటలు నమ్మి ప్రజలు గెలిపించారని, కానీ త్వరగానే వారికి తాము చేసిన తప్పేంటో అర్థమైందని అన్నారు. కేవలం బీఆర్‌ఎస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారన్నారు.

ఈ సందర్భంగా ఇటీవల వెల్లడైన లోక్‌సభ, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఫలితాలపై ఆయా ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని మండలాల వారీగా పోలైన ఓట్లు, ఓట్లశాతంపై ఆరాతీశారు. ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకూడదని సూచించారు. తనకు అండగా నిలిచిన ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని భరోసా ఇచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ పూర్వవైభవం సంతరించుకుంటుందని, నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని అన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: గతంలో బదిలీలకు దరఖాస్తులు చేయని 8 సంవత్సరాలు పూర్తైన ఎస్జీటీ, తత్స మాన కేటగిరీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రస్తుతం బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఈవో వాసం తి ఒక ప్రకటనలో కోరారు. 2024 జూన్ 1కి 8 సంవత్సరా లు పూర్తైన వారితో పాటు 2 సంవత్సరాలు పూర్తైన వారు సైతం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. గురువారం డీఈవో కార్యాలయంలో బదిలీకి దరఖాస్తు చేసుకోవాలని, గతంలో చేసుకున్నవారు అవసరం లేదన్నారు.

అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

వరంగల్ కలెక్టరేట్, జూన్ 19: వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డు గడువును సెప్టెంబరు 30వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలి స్టులకు ప్రతీ రెండేళ్లకోసారి అక్రిడిటేషన్ కార్డులను అందజేస్తుంది. అక్రిడిటేషన్ గడువు ఈనెల 30వ తేదీతో ముగుస్తుండటంతో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులో తెలిపారు.



మెట్లబావిని పరిశీలిస్తున్న కలెక్టర్

మెట్లబావిని అభివృద్ధి చేయాలి : కలెక్టర్

ఖిలావరంగల్, జూన్ 19: పురాతన కట్టడాలను భావితరాలకు అందించాలని కలెక్టర్ సత్య శారదాదేవి అన్నారు. బుధవారం శివనగర్‌లోని కాకతీయుల మెట్లబావిని అధికారులతో కలిసి పరిశీలించారు. మెట్లబావి పరిసరాల ను, ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రూ.50 లక్షలతో మెట్లబావి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర పురావ స్తుశాఖ జిల్లా అధికారి ఎం.మల్లేశం, రాష్ట్ర పురావస్తుశాఖ అధికారి మల్లునాయక్, పర్యాటకశాఖ శివాజీ, జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి, జీడబ్ల్యుఎంసీ ఈఈ శ్రీని వాస్, చరిత్రకారుడు అరవింద్ ఆర్యా పాల్గొన్నారు.

శివనగర్ ప్రభుత్వ పాఠశాల తనిఖీ

శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుస్తులు అందాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ రూ.24కోట్ల వ్యయంతో సుమారు 556 ప్రభుత్వ పాఠశాలలలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. పనులు కొన్ని పూర్తి కాగా, మరికొన్ని తుది దశలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, డీఈవో వాసంతి, హెచ్‌ఎం శ్రీధర్ పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బీవీ.నిర్మలా గీతాంబను కలెక్టర్ సత్య శారదాదేవి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్జికి కలెక్టర్ పూల మొక్క అందజేశారు. అనంతరం కలెక్టర్‌కు జడ్జి శుభాకాంక్షలు తెలిపారు.

కటకటాల్లోకి కామ ఖాకీ!

- మహిళా కానిస్టేబుల్‌పై అత్యాచారం కేసులో అరెస్టు
- కాళేశ్వరం ఎస్సై భవానిసేన్‌కు రిమాండ్
- ఉద్యోగంలో నుంచి డిస్మిస్?

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 19: కామా తురాణం.. న సిగ్గు.. న లజ్జ.. అనే సామెత ఈ పోలీసుకు అతికినట్లుగా సరిపోతుంది. గౌరవ ప్రదమైన స్థానంలో ఉండి ప్రజలను రక్షించాల్సింది పోయి.. తనతో పనిచేసే తోటి ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడి కామాంధుడిగా మారిపోయాడు. అతగాడి కామలీలలకు విసిగి వేసారిన బాధితురాలు.. ఎట్టకేలకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో బహిర్గతమైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సంచలనం రేకెత్తించిన కాళేశ్వరం ఎస్సై భవానిసేన్‌గౌడ్ వ్యవహార శైలి పోలీసు శాఖకే మచ్చ తెచ్చినట్లయింది.

మహిళా కానిస్టేబుల్‌పై అత్యాచారం

ఎస్సై భవానిసేన్‌గౌడ్ ఆ ఉమెన్ హెచ్‌పీసీని లైంగికంగా వేధింపులకు గురిచేశాడు. 20 రోజుల కిందట తనకు ఫోన్ చేసి తన కాలు స్లిప్ అయి జారిపడ్డానని, కాలికి గాయం అయిందని, తన గదికి రావాలని కోరాడు. దీంతో బాధితురాలు ఎస్సై గదికి వెళ్లగా లైంగికంగా ప్రలోభానికి గురిచేశాడు. ఆ వెంటనే అతడి పోకడను పసిగట్టిన బాధితురాలు.. ఎస్సైని తోసేసి తన గదిలోకి పరుగెత్తుకుంటూ వెళ్లింది. మళ్లీ ఈ నెల 16వ తేదీన పాత కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో తాను నివాసముండే ఇంట్లో నిద్రిస్తున్న ఉమెన్ హెచ్‌పీసీని రాత్రి 1 గంటకు అదే భవనం 2వ అంతస్తులో ఉంటున్న ఎస్సై భవానిసేన్ కిటికీలోంచి ఆమె ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె ఎస్సైని ప్రతిఘటించడంతో తన వద్ద ఉన్న గన్‌ను గురిపెట్టి బెదిరించి అత్యాచారానికి ఒడిగట్టాడు. అత్యాచారం విషయం బయటకు చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమెను బెదిరించాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు చేయడంతో విచారణలో అధికారులు నిజాలను నిగ్గు తేల్చారు.

సీఎం దృష్టికి..

కాళేశ్వరం ఎస్సై భవానిసేన్‌గౌడ్ లైంగిక వేధింపుల వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. వివిధ దినపత్రికలు, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అదికాస్తా సీఎం దృష్టికి వెళ్లింది. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకొని శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో జిల్లా పోలీసు యంత్రాంగం తీవ్రంగా పరిగణించి చర్యలకు ఉపక్రమించింది. బాధితురాలి ఫిర్యాదుతో జిల్లా పోలీస్‌బాస్ కిరణ్‌ఖరే సూచనతో భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు, కాటారం, మహదేవపూర్ సీఐల నేతృత్వంలో ఆ ఎస్సైని అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. వైద్య పరీక్షలు సైతం ఆస్పత్రిలో చేయించి అత్యాచారం నిజమేననే నిర్ధారణకు వచ్చి చర్యలు శ్రీకారం చుట్టారు. కాగా, ఇక్కడ జరిగిన ఉదంతంపై జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే.. మల్టీజోన్ ఐజీ ఏవీ రంగనాథ్‌కు సమగ్ర నివేదికను పంపగా భవానిసేన్‌పై వేటు పడింది.



భవానిసేన్ (ఫైల్)



కోర్టులో హాజరుపరుస్తున్న క్రమంలో లోనికి పరుగులు తీస్తున్న భవానిసేన్


రేప్ కేసు

లైంగిక వేధింపులు నిజమేనని తెలిసిన వెంటనే ఆ ఎస్సై వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌ను జిల్లా పోలీ సు ఉన్నతాధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలా గే బాధితురాలి ఫిర్యాదుతో తాను విధులు నిర్వర్తిం చిన కాళేశ్వరం ఠాణాలోనే భవానిసేన్‌పై ఐపీసీ 449,376(2)324, 506 సెక్షన్ల కింద రేప్ కేసు నమో దు చేశారు. అనంతరం మహదేవపూర్ ఎస్సై పవ న్, సీసీఎస్ సీఐ రవిందర్ నేతృత్వంలో ఆయన్ను భూపాలపల్లి ఫస్ట్ క్లాస్ అడిషనల్ కోర్టులో బుధవారం రిమాండ్‌కు తరలించారు. మరోవైపు ఆయనను విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

గతంలోనూ..

ఎస్సై భవానిసేన్‌గౌడ్ గతంలోనూ ఓ యువతిని వేధింపులకు గురిచేయడంతో సస్పెండ్ అయ్యారు. 2022, జూలై 12న ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన ఎస్సైగా పనిచేస్తున్న సమయంలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి సిద్ధమవుతున్న ఓ యువతిని సాయం పేరుతో మభ్యపెట్టి పోలీస్‌స్టేషన్‌కు రప్పించుకొని పలుసార్లు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. అప్పట్లో ఈ వ్యవహారాన్ని ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రముఖంగా ప్రచురించి వెలుగులోకి తెచ్చింది. దీంతో స్పందించిన అధికారులు విచారణ జరిపి భవానీసేన్‌ను సస్పెండ్ చేశారు. అయితే, రాజకీయ పలుకుబడి పోలీసు ఉన్నతాధికారుల్లో తనకున్న పరిచయాలను ఆధారంగా చేసుకొని కేవలం మూడు నెలల వ్యవధిలో తిరిగి పోస్టింగ్ సంపాదించుకున్నాడు. తదుపరి జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఠాణా ఎస్సైగా 16 ఫిబ్రవరి, 2024న మళ్లీ ఆయన పోస్టింగ్ పొందాడు.





రైతులకు కేంద్రం ఊరట

14 రకాల పంటలకు మద్దతు ధరల పెంపు

వరంగల్ వ్యవసాయం, జూన్ 19: మూడోసారి ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నరేంద్రమోదీ ప్రభుత్వం 14 రకాల పంటలకు మద్దతు ధరలను పెంచుతూ బుధవారం నిర్ణయం తీసుకుంది. కేంద్రం నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వారణాసిలో ప్రధానమంత్రి కిసాన్ సామ్మాన్ నిధి పథకం 17వ విడత డబ్బులు రూ.20వేల కోట్లను నరేంద్రమోదీ రైతుల ఖాతా ల్లో జమ చేశారు. ఆ మరుసటి రోజే రైతులకు మరో మంచి వార్తను చెప్పడం విశేషం.

పెరిగిన పంట ధర

పంట	2024-25	పెంచినది
వరి ధాన్యం	రూ.2,300	117
వరి(ఏ గ్రేడు)	రూ.2,320	117
జొన్న	రూ.3,371	91
మక్కజొన్న	రూ.2,225	135
సజ్జలు	రూ.2,625	125
రాగులు	రూ.4,290	444
కందుల	రూ.7,550	550
పెసర్లు	రూ.8,682	124
మినుములు	రూ.7,400	450
వేరుశనిగ	రూ.6,783	406
సన్‌ఫ్లవర్	రూ.7,280	520
సోయా	రూ.4,892	292
నువ్వులు	రూ.9,267	632
ఒడిసెలు	రూ.8,717	983
పత్తి	రూ.7,521	501

కార్పెంటర్ యూనియన్‌కు సహకరిస్తాం..

కాళోజీ జంక్షన్, జూన్ 19 : కార్పెంటర్ యూనియన్‌కు అన్నివిధాలా సహకరిస్తామని జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. ఇటీవల నియమకమైన ఉమ్మడి జిల్లా కార్పెంటర్ యూనియన్ నూతన కార్యవర్గ నాయకులు బుధవారం హనుమకొండ సుబేదారిలోని కార్మికశాఖ కార్యాలయంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ రమేష్‌బాబును కలిసి గత కార్యవర్గాన్ని మార్చుతూ సర్వీస్ కాపీలో మార్పులు చేసి సర్టిఫైడ్ కాపీలు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పెంటర్ యూనియన్ తరఫున రమేష్‌బాబు జన్మదినం సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను కలిసిన వారిలో కార్పెంటర్ యూనియన్ కన్వీనర్ వీణవంక సదానందం, అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.









ఎంఈవో రమాదేవి నుంచి పదోన్నతి ఉత్తర్వులు అందుకుంటున్న ఉపాధ్యాయుడు

పదోన్నతుల ఆర్డర్లు అందుకున్న ఉపాధ్యాయులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఉత్వర్వులు అందుకున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని ఆయా మండలాల ఎంఈవోలు పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు బుధవారం ఉత్తర్వులు అందజేశారు. వరంగల్ జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 434 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు సాధింగా, హనుమకొండ జిల్లాలో 454 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. అయితే వరంగల్ జిల్లాలో మాత్రం రోస్టర్ పాయింట్లలో తలెత్తిన సాంకేతిక కారణాలతో ప్రభుత్వ విభాగంలోని పీఈటీలు, లోకల్ బాడీలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతో పాటు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు బుధవారం రాత్రి వరకు ఇంకా పూర్తి కాలేదు.

ఆర్టీసీ ఆర్ఎంగా విజయభాను బాధ్యతల స్వీకరణ

బాలసముద్రం, జూన్ 19: టీజీ ఎస్ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌గా డి. విజయభాను మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ చార్మినర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ (ఆపరేషన్స్) మేనేజర్‌గా పనిచేసి పదోన్నతిపై వరంగల్ ఆర్ఎంగా వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎం విజయభానును డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె.భానుకిరణ్, డిపో మేనేజర్‌లు ఆర్ఎంకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

కేయూ క్యాంపస్, జూన్ 19: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య కేంద్రం డిగ్రీ కోర్సుల పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు ప్రాక్టీస్‌కు పాల్పడగా తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్ బుధవారం తెలిపారు. డీబారైన వారిలో హనుమకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్స్ సైన్స్ కళాశాలలో ఇద్దరూ ఉన్నట్లు పేర్కొన్నారు. వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.














కేయూలో వినియోగదారుల అధ్యయన కేంద్రం

జాతీయ వినియోగదారుల సమావేశంలో డిమాండ్


వినతి పత్రం అందచేస్తున్న చక్రపాణి

హనుమకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ విశ్వవిద్యాలయంలో వినియోగదారుల అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఢిల్లీలో జరుగుతున్న వినియోగదారుల జాతీయ సమావేశాల్లో ప్రధానంగా చర్చకు వచ్చింది. కన్స్యూమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం పక్షాన పాల్గొన్న జాతీయ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి ఈ అంశాన్ని లేవనెత్తారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో వినియోగదారుల అధ్యయన కేంద్రం లేకపోవడం లోటుగా ఉందన్నారు. వినియోగదారుల ఉద్యమం చురుకుగా సాగుతున్న వరంగల్‌లోని కేయూలో వినియోగదారుల హక్కుల రక్షణ, చైతన్యానికి అధ్యయన కేంద్రాన్ని తప్పక ఏర్పాటు చేయాలని కోరారు. ఈమేరకు ఒక తీర్మానాన్ని కూడా ఆయన ప్రవేశపెట్టారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యదర్శి నిధి ఖరేకు వినతి పత్రాన్ని కూడా సమర్పించారు. వినియోగదారుల జాతీయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్, క్యాట్కో చైర్మెన్ శంకర్ లాల్ చౌరసాయి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పెండోట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ ఈ సందర్భంగా పాల్గొన్నారు. సమావేశాలకు సీసీఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అనంత్ శర్మ అధ్యక్షత వహించారు.





పంతుళ్ల పదోన్నతుల్లో గందరగోళం

● పదోన్నతులు చేపట్టినా 40 శాతం ఖాళీలే.. ● పోస్టులున్నా అప్‌గ్రేడ్ కాని పండితులు ● పదోన్నతులు రాక నైరాశ్యంలో కొంత మంది ఎస్జీటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: విద్యాశాఖలో నిర్వహిస్తున్న పంతుళ్ల పదోన్నతుల ప్రక్రియ గందరగోళంగా ముగియనుంది. పదోన్నతులు చేపడితే ఖాళీలు భర్తీఅయ్యి అర్హత ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు లభిస్తాయనే ఆశలు అడియాశలే అయ్యాయి. 25 ఏళ్లగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న వారిలో కొంతమందికి ఈ సారి పదోన్నతుల ప్రక్రియ సైతం నిరాశే మిగిల్చింది. ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఒకటి కంటే ఎక్కువ పదోన్నతులు సాధించిన ఉపాధ్యాయులు ఒకే చోటుకు వెళుతుంటే.. మిగతా చోట్ల ఖాళీలు అలాగే ఉంటున్నాయి. దీంతో జిల్లాల్లో 40శాతం ఖాళీలు ఏర్పడుతున్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు. అర్హత సాధించినప్పటికీ కొంతమంది పండిట్లు ఉన్నతీకరణకు నోచుకోవడం లేదు. సీనియారిటీ జాబితా ప్రకారం ముందుగానే ఒకటి కంటే ఎక్కువ పదోన్నతుల ఆప్షన్లు ఎంపిక చేసుకోవడంతో కొంతమందికి పదోన్నతులకు అవకాశం లేకుండా పోయింది.

ఇదిలాఉండగా, వరంగల్ జిల్లాలో ఐదుగురు తెలుగు పండిట్లు ఉన్నతీకరణకు నోచుకోలేదు. హనుమకొండ జిల్లాలో 12 మంది తెలుగు పండిట్లు, 13మంది హిందీ పండిట్లు ఉన్నతీకరణకు నోచుకోలేదు. ఇక వరంగల్ జిల్లాలో మాత్రం రోస్టర్ పాయింట్లలో తలెత్తిన సాంకేతిక కారణాలతో ప్రభుత్వ విభాగంలోని పీఈటీలు, లోకల్ బాడీలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతో పాటు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు బుధవారం రాత్రి వరకు ఇంకా పూర్తి కాలేదు. మొత్తంగా ఈ సారి పదోన్నతుల ప్రక్రియ సైతం గందరగోళంగానే ముగుస్తున్నట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, వరంగల్‌జిల్లాలో అన్ని కేటగిరీలల్లో కలిపి మొత్తం 434 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించగా, హనుమకొండ జిల్లాలో 454 మంది ఉపాధ్యాయులు పదోన్నతి పొందారు.

40 శాతం ఖాళీలే..

పదోన్నతుల ప్రక్రియలో ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్లుగాను, పండిట్లు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా పదోన్నతులు కల్పిస్తుంటే ఈ ప్రక్రియలో సైతం 40 శాతం ఖాళీలు ఏర్పడనున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులకు వారి అర్హతలను బట్టి రెండు, మూడు పదోన్నతులు వస్తున్నాయి. వారికి ఆ మేరకు ఉత్తర్వులు అందజేయడంతో వారు ఒకే ఒక పోస్టులో చేరనున్నారు. దీంతో మిగతా రెండు పోస్టులు ఖాళీలు ఏర్పడనున్నాయి. ఇలా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు సాఫ్ట్‌వేర్‌లో ఏర్పాటు చేయకపోవడంతో మళ్లీ పదోన్నతుల ప్రక్రియ జరిగేంత వరకు ఆ పోస్టులు ఖాళీలుగానే ఉండనున్నాయి. ఈ రకంగా సుమారుగా 40 శాతం ఖాళీలు అలాగే ఉండనున్నాయి.

అప్‌గ్రేడ్ కాని కొంత మంది పండితులు

దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదు అన్న చందంగా తయారయ్యింది రెండు జిల్లాల్లో పండితుల పరిస్థితి. జిల్లాల వారిగా కేడర్ స్ట్రెంత్ ప్రకారం పండితుల పోస్టులు అప్‌గ్రేడ్ అయినా అర్హత కలిగిన పండిట్లలో కొంతమందికి మాత్రం ఉన్నతీకరణ లేకుండా మొండిచేయే మిగిలింది. పోస్టులు అప్‌గ్రేడ్ అయినా కొంత మంది ఎల్పీలు మాత్రం అప్‌గ్రేడ్ కాలేదు.

వరంగల్ జిల్లాలో ఇలా...

వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ విభాగంలో 16 ఎల్పీ తెలుగు పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. 8 మంది ఉపాధ్యాయులు ఉండగా, అందులో 5గురు ఉపాధ్యాయులకు మాత్రమే ఉన్నతీకరణ పోస్టుల్లో అవకాశం దక్కింది. మరో ముగ్గురు ఉపాధ్యాయులకు అవకాశం దక్కలేదు. వీరికి రోస్టర్ పాయింట్ల ప్రకారం ఉన్నతీకరణ దక్కడం లేదని అధికారులు చెబుతుంటే అధికారుల పొరపాటు వల్లనే తమకు ఉన్నతీకరణ దక్కలేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

హనుమకొండ జిల్లాలో ఇలా...



హనుమకొండ జిల్లాలో పరిస్థితి మరోలా ఉంది. ఎల్పీ తెలుగులో మొత్తం 103 పోస్టులుం డగా, అందులో 90 పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. అయితే ఇందులో 90 మందికి మాత్రమే ఉన్నతీకరణ అవకాశం దక్కగా, మరో 12 మంది ఎల్పీ తెలుగు ఉపాధ్యాయులకు నిరాశే మిగిలింది. ఇక హిందీ పండిట్ల విషయంలోనూ ఇదే మాదరిగా జరిగింది. 106 పోస్టులుండగా అందులో 94 మందికి ఉన్నతీకరణ అవకాశం దక్కగా మరో 12 మందికి ఉన్నతీకరణ అవకాశం దక్కలేదు.

వింత పరిస్థితి

పదోన్నతుల ప్రక్రియ విద్యాశాఖలో వింత పరిస్థితిని నెలకొల్పింది. ఎల్పీల ఉన్నతీకరణలో భాగంగా కొన్ని పాఠశాలల్లో పోస్టు ఉన్నతీకరణ అయ్యింది. అయితే అక్కడ పనిచేస్తున్న సదరు ఉపాధ్యాయులకు మాత్రం ఉన్నతీకరణ దక్కలేదు. దీంతో ఉన్నతీకరణ అర్హత పొందిన ఉపాధ్యాయులు అదే పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడే ఉన్నతీకరణ పొందని ఉపాధ్యాయులు సైతం పనిచేయాల్సి ఉంటుంది.

ఇవీ ఉదాహరణలు

వరంగల్ మండల పరిధిలోని కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న హిందీ పండిట్ పోస్టు అప్‌గ్రేడ్ అయ్యింది. ఆ పోస్టులో పనిచేస్తున్న హిందీ పండిట్‌కు మాత్రం అప్‌గ్రెడేషన్ దక్కలేదు. దీంతో అప్‌గ్రేడ్ అయిన ఎల్పీతో పాటు అక్కడ ప్రస్తుతం పనిచేస్తున్న ఎల్పీ సైతం పనిచేయాలి. కమలాపూర్ మండలంలోని మాదన్నపేట పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఎల్పీకి ఉన్నతీకరణ అవకాశం దక్కలేదు. కానీ పోస్టు మాత్రం ఉన్నతీకరణ అయ్యింది. దీంతో అక్కడ పనిచేస్తున్న ఎల్పీతో పాటు అప్‌గ్రేడ్ అయిన ఎల్పీ సైతం ఇక్కడే పనిచేయాల్సి ఉంది. అయితే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న చోట ఇద్దరు ఎల్పీలు పనిచేయడం గమనార్హం.

జిల్లాల వారిగా పదోన్నతులు ఇలా...

	కేటగిరి	ప్రభుత్వ	లోకల్‌బాడి
వరంగల్ జిల్లాలో...	పీఎస్‌హెచ్ఎం(ఎల్ఎఫ్ఎల్)	7	56
	ఎస్ఏ ఇంగ్లీష్	5	10
	ఎస్ఏ గణితం	1	20
	ఎస్ఏ తెలుగు	5	105
	ఎస్ఏ బయోసైన్స్	7	22
	ఎస్ఏ హిందీ	5	88
	ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	10	42
	ఎస్ఏ ఫిజికల్ సైన్స్	1	2
	ఎస్ఏ సోషల్ స్టడీస్	10	38
	మొత్తం	**41**	**393**
హనుమకొండ జిల్లాలో...	పీఎస్‌హెచ్ఎం(ఎల్ఎఫ్ఎల్)	5	44
	ఎస్ఏ తెలుగు	3	87
	ఎస్ఏ హిందీ	6	88
	ఎస్ఏ ఇంగ్లీష్	4	13
	ఎస్ఏ గణితం	3	31
	ఎస్ఏ ఫిజికల్ సైన్స్	1	7
	ఎస్ఏ బయోసైన్స్	5	40
	ఎస్ఏ సోషల్ స్టడీస్	7	48
	ఎస్ఏ ఉర్దూ	2	0
	ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	8	48
	ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్	0	1
	మొత్తం	**47**	**407**

ఒకే రాష్ట్రంలో రెండు విధానాలు సరికాదు..

డాక్టర్ ఎ. సదయ్య, ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి

ఒకే రాష్ట్రంలో రెండు విధానాలు సరికాదు. మల్టిజోన్-2లో రోస్టర్ పాయింట్ల ఆధారంగా అర్హత కలిగిన ఎల్పీలందరికీ ఉన్నతీకరణకు అవకాశం ఇస్తుంటే మల్టీజోన్-1లో మాత్రం పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. కానీ అందరికీ ఉన్నతీకరణ అవకాశం మాత్రం కల్పించడం లేదు. అధికారులు, ప్రభుత్వం పునరాలోచించి ఎల్పీలందరిని ఉన్నతీకరణ చేయాలి.

అర్హులైన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలి

పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మన్నె చంద్రయ్య

అర్హులైన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మన్నె చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ డీఈవో కార్యాలయం ముందు పలువురు ఉపాధ్యాయులతో ఆయన నిరసన వ్యక్తం చేశారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పలువురు ఎల్పీలకు ఉన్నతీకరణకు అవకాశం రాకపోవడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్హులైన వారందరికి న్యాయం చేకరూర్చాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రూ.650 కోట్లతో బడ్జెట్?

నేడు బల్దియా ప్రత్యేక సమావేశం ● హాజరు కానున్న మంత్రి, ఎమ్మెల్యేలు


కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 19: వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం బడ్జెట్ సమావేశం జరుగనుంది. ఈ బడ్జెట్ సమావేశంలో 2024- 2025 సంవత్సరానికిగాను రూ.650కోట్ల నిధుల ప్రతిపాదనలు, ఆమోదంపై సమీక్ష జరుగనుందని విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఈ యేడు ఎన్నికల కోడ్ రావడంతో మూడు మాసాలు గడిచి పోవడం వల్ల 9 నెలలకే ఈ బడ్జెట్ వర్తిస్తుందని చెప్పకొస్తున్నారు. మేయర్ గుండు సుధారాణి నిర్లక్ష్యం వల్లనే ఇప్పటి వరకు ఈ యేడు బడ్జెట్ సమావేశం, ప్రకటనలో జాప్యం జరిగిందని కొందరు కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. అయితే గత 2023-2024 బడ్జెట్‌లో రూ.523కోట్లు ప్రకటించారు. బల్దియాకు వివిధ రకాల ట్యాక్సీలు, భవనాల అద్దెల రూపంలో వచ్చే ఆదాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వస్తాయి. సుమారు వంద కోట్ల వరకు బల్దియాకు పన్నుల రూపంలో సొంత ఆదాయం రాగా, మిగతా నిధులు ఎమ్మెల్యే, ఎంపీల్యాడ్స్‌తో పాటు నగర పాలక సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయిస్తుంది. ఈ నిధులతో సిబ్బంది జీతాలు, విలీన గ్రామాల అభివృద్ధి, శానిటేషన్, లోతట్టు ప్రాంతాల అభివృద్ధి, రోడ్లు, డ్రేనేజీల నిర్మాణం చేపట్టనున్నారు.

మంత్రి, ఎమ్మెల్యేలు హాజరు

బల్దియాలో జరిగే బడ్జెట్ సమావేశానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిలకు బల్దియా నుంచి రెండు రోజుల ముందుగానే ఆహ్వానం పంపించినట్టు తెలిసింది. వీరు సమావేశానికి హాజరై వరంగల్ నగరం అభివృద్ధిపై అంచనాలు, వ్యయంపై చర్చిస్తారు. ప్రధానంగా 66 డివిజన్‌లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసే ఆలోచనలో మంత్రి, ఎమ్మెల్యేతోపాటు మేయర్ ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

సమావేశంపై నీలినీడలు?

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం గురువారం బల్దియా కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు జరుగనుంది. ఈ సమావేశం నిర్వహణపై నాలుగు రోజుల ముందుగానే బల్దియా సర్వసభ్య సమావేశంలో సెక్రెటరీ విజయలక్ష్మి ప్రకటించారు. కాగా, రాష్ట్రంలో చాలా మున్సిపాలిటీలలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ప్రభుత్వ అనుమతితో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాయి. శాఖాపరంగా రావలసిన రాబడి, పోబడి గుర్తించి ప్రకటించి అమలు పరిచారు. కానీ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2024-25 బడ్జెట్ ప్రకటించలేదు. అయితే కావాలనే మేయర్ బడ్జెట్ ప్రకటన జాప్యం చేసిందని పాలక వర్గంలోని కొందరు అసంతృప్త వర్గం కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. అయితే గురువారం బల్దియా బడ్జెట్ సమావేశంపై నీలినీడలు అలుముకున్నాయి. అసంతృప్త కార్పొరేటర్లు బల్దియాలో బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించనున్నట్లు తెలిసింది. ఇదిలా వుండగా, బీఆర్ఎస్ నుంచి మేయర్‌గా గెలిచి కాంగ్రెస్ పార్టీ నుంచి బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనడానికి సుధారాణి అనర్హురాలని వారు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ అశ్విని తానాజీని కలిసి వినతి పత్రం సమర్పించారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: పాలిసెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ ఈ నెల 20 (గురువారం) నుంచి ప్రారంభం కానున్నట్లు పాలిసెట్-2024 వరంగల్ కన్వీనర్ డాక్టర్ బైరి ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 20 నుంచి 24 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్స్ కోసం స్లాట్‌లను బుక్ చేసుకోవాలని తెలిపారు. స్లాట్‌లు బుక్ చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 22 నుంచి 25 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. 22 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుందని, 30న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. 30 నుంచి జూలై 4 వరకు వెబ్‌పోర్టల్ ద్వారా అడ్మిషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పెంపు

హనుమకొండ కలెక్టరేట్, జూన్19: వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ (గుర్తింపుకార్డు) గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల కోసం రెండేళ్లకోసారి అక్రిడిటేషన్ కార్డుల సదుపాయం రాష్ట్ర సమాచార శాఖ కల్పిస్తుంది. ఆ గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తుండటంతో గడువు తేదీని 3నెలలు (సెప్టెంబర్ 30వరకు) పొడిగించినట్లు హనుమంతరావు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం

వరంగల్ మెడికల్, జూన్ 19: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు తెలిపారు. 1 నుంచి 19 యేళ్ల వయస్సు గల పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు ఇప్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ మాత్రలో భోజనం అనంతరం ఇస్తారన్నారు. ఈ మాత్రల వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఏదైనా కారణాలతో అందుబాటులో లేని పిల్లలకు ఈ నెల 27వ తేదీన మాప్ అప్ డే రోజు ఇస్తారన్నారు. హనుమకొండలోని బీఈడీ కాలేజీ పక్కన ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 12.30 గంటలకు ఈకార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.

'భగీరథ' కనెక్షన్ ఇంటింటి సర్వే పూర్తి చేయాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జూన్ 19: జిల్లాలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వేలో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వే పురోగతిపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ నల్లాల సర్వే మండలాల వారీగా ప్రణాళికబద్ధంగా ప్రతీ ఆపరేటర్ రోజుకు 25 నుంచి 50 వరకు అప్లికేషన్లు పూర్తి చేయాలని, ఈ సర్వే అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, మిషన్ భగీరథ ఈఈ వెంకటరమణారెడ్డి, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

మాటలతో ఏమార్చి.. ఏటీఎం కార్డు తీసుకుని..

రూ.78వేలు అకౌంట్ నుంచి మాయం

మట్టెవాడ, జూన్ 19 : ఏటీఎం మిషన్‌లో డబ్బులు జమ చేస్తానని నమ్మించి, డబ్బులు జమ చేసి.. మాటలతో ఏమార్చి ఏటీఎం కార్డు డబ్బులు స్వాహా చేసిన ఘటన వరంగల్ ఇండస్ట్రియల్ ఎస్‌బీఐ బ్యాంకు దగ్గర చోటు చేసుకుంది. మట్టెవాడ పోలీసుల కథనం ప్రకారం.. మండిబజార్‌కు చెందిన మహ్మద్ అయాజ్ మే6న ఎంజీఎం ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఇండస్ట్రియల్ ఎస్టేట్ బ్రాంచిలో రూ.90 వేలు అతడి అకౌంట్‌లో ఏటీఎం మిషన్ ద్వారా డిపాజిట్ చేయడానికి వెళ్లాడు. ఎమౌంట్‌ను ఏటీఎం మిషన్‌లో పెట్టి డిపాజిట్ చేసే సమయంలో అతడి వెనుక గుర్తు తెలియని వ్యక్తి వచ్చి డిపాజిట్ చేయడానికి సహాయం చేస్తానని చెప్పి అయాజ్ వద్ద నుంచి ఏటీఎం కార్డును తీసుకున్నాడు. కార్డును మార్చి డూప్లికేట్ కార్డును అయాజ్ తీసుకుని డిపాజిట్ అయిన తర్వాత ఇంటికి వెళ్లాడు. ఒక గంట తర్వాత అయాజ్ అకౌంట్ నుంచి పలు మార్లు అమౌంట్ డెబిట్‌అయినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. మొత్తం రూ.75వేల డ్రా అయ్యాయి. దీంతో మోసపోయానని గమనించిన అయాజ్ బుధవారం మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య



సుల్తాన్‌ఖాన్ (ఫైల్)

గీసుగొండ, జూన్ 19: గరీబ్‌నగర్‌కు చెందిన ఎండీ సుల్తాన్‌ఖాన్(60) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం. గరీబ్‌నగర్‌కు చెందిన సుల్తాన్‌ఖాన్ కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడి భార్య కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి అతను కొడుకుల వద్ద ఉంటున్నాడు. భార్య లేదన్న మనోవేధనతో ఈనెల 18న రాత్రి ఇంటి నుంచి బయటికి వచ్చి లేబర్‌కాలనీ సమీపంలో తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పంచనామా అనంతరం మృతుడి కుమారుడు అక్రంఖాన్‌ను అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, జూన్ 19: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ముగ్గురు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ ముగ్గురు వాహనదారులకు వేయి రూపాయల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

కరీమాబాద్, జూన్ 19: శంభునిపేటకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు బుధవా రం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం శంభునిపేట ప్రాంతానికి చెందిన హబీబున్నిసా (22) అనే యువతి బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె తండ్రి మహ్మద్ అజ్గర్ కూతురు కనిపించడంలేదని ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

మంత్రి గారు.. ఆదుకోరూ..!

● వర్షాలతో నీటమునుగుతున్న కాలనీలు ● పదేళ్లుగా సాగుతున్న లేబర్‌కాలనీ - ఏనుమాముల రోడ్ పనులు
● శాశ్వత పరిష్కారం చూపాలని బాధితుల వినతి ● నేటి సమావేశంలో మంత్రి, మేయర్ దృష్టి సారించాలని విజ్ఞప్తి



లక్ష్మీగణపతి కాలనీలో పారుతున్న వరద(ఫైల్)

వరంగల్‌సిటీ, జూన్ 19: వర్షాకాలం వస్తుందంటే చాలు వరంగల్ నగరంలోని లోతట్టు ప్రాంత వాసులు గజగజ వణిపోతుంటారు. నగరం మేఘావృతమైందంటే వారి గుండె ధడధడలాడతుంది. కాస్త భారీ వర్షం పడిందో ఇక వారి కష్టాలు వర్ణణాతీతం. 15ఏళ్లుగా నగరంలోని గాంధీనగర్, ఎస్‌ఆర్‌నగర్, సాయిగణేష్ కాలనీ, శ్రీసాయి కాలనీ, మధురానగర్, శ్రీ వెంకటేశ్వర కాలనీ, పద్మనగర్ తదితర లోతట్టు ప్రాంతవాసులు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వాలు మారుతున్నా లోతట్టుప్రాంత వాసుల సమస్యలు తీరడం లేదు. నేడు(గురువారం) బల్దియా ప్రధాన కార్యాలయంలో మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి ఆధ్వర్యంలో నగరాభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ముంపు కాలనీల శాశ్వత పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



కాశిబుగ్గ ఏనుమాముల ప్రధాన రోడ్డుపై వరద(ఫైల్)

నీటమునుగుతున్న 19, 14 డివిజన్లు

నగరంలోని 19వ డివిజన్ గాంధీనగర్, 14వ డివిజన్ ఎస్‌ఆర్‌నగర్, సాయిగణేష్ కాలనీ, శ్రీసాయి కాలనీ, మధురానగర్, శ్రీ వెంకటేశ్వర కాలనీలు లోతట్టు ప్రాంతాలు వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయి. ఈ కాలనీలకు ఎగువన ఉన్న క్రిస్టియన్ కాలనీ, లేబర్‌కాలనీ, కోటి లింగాల గుడి, కీర్తినగర్ కాలనీ, ఎన్‌టీఆర్‌నగర్, మణికంఠకాలనీ, సుదరయ్య నగర్, బాలాజీనగర్‌ల నుంచి వచ్చే వరదనీటితో లోతట్టు ప్రాంతాలు నీటమునుగుతున్నాయి. ఏటా అధికారులు, పాలకుల బాధితులను పరామర్శించడం, ఆ సమయంలో పునరావాస కేంద్రాలకు తరలించి తాత్కాలిక మరమతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. 15ఏళ్లుగా సమస్య ఏటేటా జటిలమవుతున్నా శాశ్వత నివారణ చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారం కోసం వందల కోట్ల నిధులు విడుదల చేశామంటూ పాలకులు చెప్పడమే తప్ప, క్షేత్రస్థాయిలో ఆచరణలోకి రావడం లేదని పేర్కొంటున్నారు.

మంత్రి సురేఖ స్పందించేనా..

లేబర్‌కాలనీ - ఏనుమాముల రోడ్డు గుంతలమ యం కావడంతో కొత్త రోడ్డు నిర్మాణం కోసం 2017లో అప్పటి ఎమ్మెల్యే కొండా సురేఖ సుమారు రూ.8కోట్లతో పనులను ప్రారంభించారు. పనులు ముందుకు సాగలేదు. తర్వాత 2019లో తూర్పు ఎమ్మెల్యేగా నన్నపునేని నరేందర్ గెలుపొందారు. దీంతో ఈ రోడ్డును స్మార్ట్ సిటీ రోడ్లలో భాగంగా లేబర్‌కాలనీ - ఏనుమాముల వంద ఫీట్ల రోడ్డును విస్తరించడంతోపాటు రోడ్డుకు మధ్యలో గ్రీనరీ, సెంట్రల్ లైటింగ్, రోడ్డుకు ఇరువైపులా మురుగు నీరుపోయేందుకు పైపులైన్ల నిర్మించేందుకు సుమారు రూ.32 కోట్లతో పనులు చేపట్టారు. అప్పటి మంత్రి కేటీఆర్ పనులను ప్రారంభించారు. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

గుత్తేదారు ఇష్టారాజ్యం..

లేబర్‌కాలనీ- ఏనుమాముల రోడ్డు విస్తరణ, లైటింగ్, గ్రీనరీ, పైపులైన్ల పనులను రూ.32 కోట్లతో చేపడుతుండగా, గత ప్రభుత్వంలోని ఓ ఎమ్మెల్యే బంధువు పనులు చేజిక్కించుకున్నారు. ఐదేళ్లు నాన్చు తూ.. మొత్తానికి లేబర్‌కాలనీ- ఏనుమాముల వరకు సీసీ రోడ్డు నిర్మించారు. మధ్యలో గ్రీనరీ, సెంట్రల్ లైటింగ్ ఇంకా ఏర్పాటు చేయలేదు. మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు పైపులైన్లను వేయలేదు. సీసీ రోడ్డు నాసిరకంగా వేయడంతో ఎక్కడికక్కడ పగుళ్లు ఏర్పడ్డాయి.

పైపులైన్ల ఏర్పాటు ద్వారానే శాశ్వత పరిష్కారం

వంద ఫీట్ల రోడ్డుకు ఇరువైపులా మురుగు నీరు సాఫీగా వెళ్లేందుకు పైపులైన్లను ఏర్పాటు చేస్తే ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు పైపులైన్ల గుండా కిందకు వెళుతుంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా నివారించవచ్చు. కానీ.. ఆ గుత్తేదారు ఓ మాజీ ప్రజా ప్రతినిధి బంధువు కావడంతో అధికారులు భయపడుతున్నారు. అతనితో పనులుచేయించడానికి జంకుతున్నారు.

పద్మనగర్‌వాసుల ఆందోళన

గతేడాది పద్మనగర్ కాలనీ ముంపునకు గురవడంతో ఈసారి కూడా అదే పరిస్థితి తలెత్తే పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రధానం ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద నీరంతా పద్మనగర్ రెండో ఆర్చి వరకు వస్తుంది. అక్కడ కాల్వకు అడ్డుగా ఓ ప్రైవేటు కట్టడం ఉండడంతో కాల్వ నుంచి వచ్చిన వరద సదరు కట్టడాన్ని ఢీ కొడుతూ రెండుభాగాలు నీరు చీలిపోతోంది. ఒక భాగం నీరు చెరువులోకి వెళ్తుండగా, రెండో భాగం పద్మనగర్ రెండో ఆర్చి నుంచి కాలనీలోకి పెద్ద ఎత్తున వరదనీరు వస్తోంది. దీంతో కాలనీ నీటమునుగుతోంది. మంత్రి స్పందించి తగిన చర్యలు తీసుకుని, వరదనీరు సాఫీగా వెళ్లేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి

ఆత్మీయ వీడ్కోలులో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య




వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జూన్ 19: అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రావీణ్యకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం జరిగింది. వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి అధ్యక్షతన జిల్లా అధికారులు ప్రావీణ్యను ఘనంగా సన్మానించారు. వివిధ శాఖల అధికారులు వరంగల్ జిల్లాలో సుమారు 15 నెలలపాటు కలెక్టర్‌గా పని చేసిన విధానం, సమర్థవంతమైన పాలనను గుర్తు చేశారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో శాసనసభ, లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికలు, వివిధ అభివృద్ధి పనులు విజయవంతంగా నిర్వహించడంలో అధికార యంత్రాంగం అందించిన సహాయ సహకారాలు మరువలేనివన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, టీజీవో, టీఎన్‌జీవో, ట్రెసా నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది గజమాలలు, పూలబొకేలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీసీవో సంజీవ రెడ్డి, ఆర్డీవోలు సిదం దత్తు, కృష్ణవేణి, టీజీవో అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, ట్రెసా నాయకులు రియాజొద్దీన్, రాజ్‌కుమార్, ఇక్బాల్ పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య

కరీమాబాద్, జూన్ 19: ఆర్థిక సమస్యలతోపాటు తనకు వివాహం కావడం లేదని మనస్థాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. సీఐ కథనం ప్రకారం. ఏసీరెడ్డినగర్‌కు చెందిన కొమరాతి శివ(33) ట్రాలీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇంటి అవసరాల కోసం బ్యాంకు నుంచి రుణం తీసుకొని ప్రతి నెల వాయిదాల పద్ధతిలో చెల్లించేవాడు. ఇటీవల ట్రాలీ నడవకపోవడంతో ఆర్థిక సమస్యలు పెరిగాయి. దీనికి తోడు తనకు వివాహం కావడం లేదని మనస్థాపంతో బుధవారం రాత్రి అందరూ పడుకున్న తర్వాత ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడి తండ్రి కొమరాతి జంపయ్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మక్కలకు మార్కెట్లో భలే గిరాకీ



వరంగల్ వ్యవసాయం, జూన్ 19: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో బుధవారం మక్క జొన్నలకు మంచి ధర పలికింది. క్వింటాకు గరిష్ట ధర రూ.2,500 పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. చిట్యాల మండలం జూకల్ గ్రామానికి చెందిన ఆకుల రవీందర్ 20 బస్తాల మక్కజొన్నలను ఎంకే ట్రేడర్స్ అడ్తికి తీసుకురాగా ప్రేమ్ ఎంటర్‌ప్రైజెస్ ఖరీదుదారు అందులో 11 బస్తాలను క్వింటాకు రూ.2,500 చొప్పున కొనుగోలు చేశారు.

మార్కెట్‌కు మొత్తం 131 బస్తాల మక్కలు రాగా, గరిష్టంగా ఆకుల రవిందర్ తీసుకువచ్చిన మక్కలకు రూ.2500 ధర పలికింది. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర మక్కలకు రూ.2,090 కాగా మద్దతు ధరకు మించి ధర పలుకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

పోచమ్మమైదాన్, జూన్ 19: మూడో డివిజన్ ఆరెపల్లిలో బుధవారం కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. నాయకుడు బుద్దె పెద్దన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కార్పొరేటర్ జన్ను షిబారాణి, నాయకుడు జన్ను అనిల్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం బాటసారులకు సీట్లు పంపిణీ చేశారు. వరంగల్ నగరంలోని ఎంజీఎం చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు గరిదాసు జయప్రకాష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు.

● సంగెం: మండలంలోని మొండ్రాయిలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు, ఏఐసీసీ తెలంగాణ మెంబర్ పోశాల నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

● ఖిలావరంగల్: రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కార్పొరేటర్ వస్కుల బాబు క్రిస్టియన్‌కాలనీలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు జన్ను వివేక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. 37వ, డివిజన్ తూర్పుకోట పోచమ్మదేవాలయం వద్ద కొండా యువ సేన మండల అధ్యక్షుడు ఇప్ప నరేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు.

● గిర్మాజీపేట: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా వరంగల్ ఆయుర్వేద హాస్పిటల్‌లో పేద రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.పద్మావతి, మెడికల్ ఆఫీసర్ మైదం రాజు, ఆఫీసు సూపరింటెండెంట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నాం..

మాల్దీవ్స్ కౌన్సిల్ బృందం సభ్యులతో మేయర్ సుధారాణి



మాల్దీవ్స్ కౌన్సిల్ బృందం అధికారులతో మేయర్, కమిషనర్, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 19: నగర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నా మని మేయర్ గుండు సుధారాణి తెలిపారు. బుధవారం కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) సమావేశ మందిరంలో మాల్దీవ్స్ కౌన్సిల్ సభ్యులు నగరంలో చేపట్టి కొనసాగిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. జీడబ్ల్యూఎంసీ శానిటేషన్ విభాగంలో అవలంబిస్తున్న విధానాలు, ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో చేపట్టబడుతున్న పనులు, స్మార్ట్‌సిటీ పథకం కింద చేపట్టిన పనులు, మెప్మా సంబంధించిన స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్న వివిధ పథకాలు, బల్దియా సమకూర్చుకుంటున్న ఆర్థిక వనరుల గురించి ఆయా విభాగాల ఉన్నతాధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జీడబ్ల్యూఎంసీ అవలంబిస్తున్న శానిటేషన్ నిర్వహణ విధి విధానాలను వివరించారు.

మేయర్ మాట్లాడుతూ.. బల్దియాకు పట్టణ ప్రణాళిక, పన్నుల వసూళ్ల ద్వారా ఆర్థిక వనరులను పెంపొందించుకుంటున్నామన్నారు. ఉద్యానవన విభాగం చక్కని పనితీరును కనబరుస్తుందని ప్రశంసించారు. ఎవెన్యూ మీడియన్ బ్లాక్ ప్లాంటేషన్‌తోపాటు పార్కులు, నర్సరీల నిర్వహణ చేస్తున్నదని, యేటా వార్షిక బడ్జెట్‌లో 10శాతం గ్రీన్‌బడ్జెట్‌కు నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఇంజనీరింగ్ అభివృద్ధి పనులకు సంబంధించి స్మార్ట్‌సిటీలో భాగంగా నగర వ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. నగరానికి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వేజోన్‌లతో అనుసంధానం ఉందని, గతంలోనే ఏర్పాటైన ఎయిర్‌పోర్ట్‌ను తిరిగి పునరుద్ధరించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. నగరం ఎదుర్కొంటున్న అతి ప్రధాన సమస్య స్ట్రామ్ వాటర్ డ్రైన్‌ల లేమి అని, వాటిని నిర్మించడానికి ప్రభుత్వం టీయూఎఫ్‌డీసీ కింద రూ.250కోట్లు కేటాయించిందన్నారు. అనంతరం మాల్దీవ్స్ కౌన్సిల్ సభ్యులను మేయర్, కమిషనర్ శాలువాతో సత్కరించి పూలమొక్కలు అందించారు. మాల్దీవ్స్ కౌన్సిల్ సభ్యులు మేయర్, కమిషనర్‌తోపాటు ఉన్నతాధికారులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, బల్దియా ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, పీఆర్‌ఓ ఆయూబ్ అలీ, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, హెచ్‌ఓ రమేశ్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారావు, రవీందర్, డీసీసీ ప్రకాశ్‌రెడ్డి, ఈఈలు పాల్గొన్నారు.

డీసీపీని కలిసిన ఇంతేజార్ గంజ్ సీఐ



వరంగల్ చౌరస్తా, జూన్ 19: సెంట్రల్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన షేక్ సలీమాను ఇంతేజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన డీసీపీని పోలీసు హెడ్ క్వార్టర్‌లో సీఐ బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నీట్ ర్యాంకర్ గ్రీష్మితకు సత్కారం

శంభునిపేట, జూన్ 19 : రంగశాయిపేటకు చెందిన దామెరకొండ గ్రీష్మిత ఇటీవలె ప్రకటించిన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయి ర్యాంకు సాధించగా, బుధవారం రంగశాయిపేటలోని వీరభద్ర పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు బక్కి వీరసాయిప్రసాద్, గాదె మల్లేశం, బక్కి సత్యం, ఆరె రవీందర్, బక్కి వేణు, రవీందర్ పాల్గొన్నారు.





కార్పొరేటర్లతో భేటీ అయిన వినయ్, నన్నపునేని, చల్లా

బడ్జెట్‌పై విస్తృతంగా చర్చించండి

బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు వినయభాస్కర్ సూచన

రాంనగర్, జూన్ 19: ప్రజల పక్షాన పోరాడాలని, నగర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ సూచించారు. గురువారం కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నందున బుధవారం బీఆర్‌ఎస్ కార్పొరేటర్లతో వినయభాస్కర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి భేటీ అయ్యారు. బడ్జెట్ సమావేశంలో చర్చించాల్సిన అంశాలను, నగర సమస్యల పరిష్కారానికి నిధుల కేటాయింపుల విషయంలో పాలకవర్గంపై చేయాల్సిన ఒత్తిడి, పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేసేందుకు కార్పొరేటర్లు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా వినయభాస్కర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ సమావేశంలో స్థానిక సమస్యలపై చర్చించాలన్నారు. వరదలు, తాగునీటి సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకురావాలన్నారు. నగరాభివృద్ధికి ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు. నాలా, డ్రైనేజీ పూడికతీతలు, పారిశుద్ధ్య నిర్వహణపై సమగ్ర చర్చ జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు మరుపల్లి రవి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, బస్వరాజ్ శిరీష, అశోక్ యాదవ్, దివ్యారాణి, రాధికారెడ్డి, స్వరూపారాణి, రంజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'కుల గణన చేపట్టాలి'

గిర్మాజీపేట, జూన్ 19: సామాజిక తరగతులకు చట్ట సభల్లో సమాన వాటాలు దక్కాలంటే తక్షణమే కుల గణన చేపట్టి జనాభా కనుగుణంగా రిజర్వేషన్లు ప్రకటించి, స్థానిక ఎన్నికలు నిర్వహించాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరస్వామి, బీఎల్‌ఎఫ్ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ నర్ర ప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కుల జన గణన- బీసీ రిజర్వేషన్లు- స్థానిక ఎన్నికలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం వరంగల్ తూర్పు కన్వీనర్ ఐతం నగేశ్ అధ్యక్షతన వరంగల్‌లోని ఓంకార్ భవన్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీరస్వామి, ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ నూటికి 93 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు చట్టసభల్లో సమాన వాటా దక్కకుండా అగ్రవర్ణ కులపాలకులు కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ విషయంపైనే క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేస్, తెలంగాణ ఉద్యమకారుల కన్వీనర్ సోమ రామ్మూర్తి, డీపీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబూరుఆవు, పూలే సామాజిక న్యాయవేదిక ప్రతినిధి కేడెల ప్రసాద్, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రాజిరెడ్డి, బీటీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ దూడల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హనుమకొండ టౌన్, జూన్19: 11 కేవీ లైన్ మరమ్మతులో భాగంగా హంటర్‌రోడ్డు ఫీడర్‌లోని గురువారం విద్యుత్‌సరఫరా అంతరాయం కలుగుతుందని డీఈ శంకేసి మల్లికార్జున్‌ప్రకటనలో తెలిపారు. హంటర్‌రోడ్డు, బీట్‌బజార్, రామన్నపేట ఏరియాలో ఉదయం 8.30 నుంచి 11.30 వరకు సరఫరా ఉండదన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL గురువారం 20 జూన్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

మోడల్ పాఠశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

చెన్నారావుపేట జూన్ 19 : మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మోడల్ పాఠశాలలో మిగిలిన ఉన్న సీట్ల కోసం విద్యార్థులు తమ దరఖాస్తులను చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మీ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విలేఖరులతో ఆమె మాట్లాడుతూ 2024- 2025 విద్యా సంవత్సరంలో 6 వ తరగతి నుండి 10 వ తరగతి వరకు ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, ఎంఈసీల గ్రూపులల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తులను అందించాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ దరఖాస్తులను ఈ నెల 22 వరకు పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్ నెంబర్ 9849004967, 9703061779, 99484100004లను సంప్రదించాలని తెలిపారు.

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి

వర్ధన్నపేట, జూన్ 19 : నీట్ లీకేజీకి సంబంధించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని, పరీక్ష తిరిగి నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కల్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నీట్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని కోరుతూ ఫ్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో 67 మందికి 720 మార్కులకు 720 మార్కులతో ఆల్ ఇండియా మొదటి ర్యాంకు రావడంతో పాటు అందులో అరుగురు విద్యార్థులు ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసినవారు కావడం గమనార్హమన్నారు. గత ఏడాది ఇద్దరికి, అంతకు ముందు సంవత్సరం నలుగురికి మాత్రమే 720మార్కులు వచ్చి ఆల్ ఇండియా ర్యాంకర్‌గా నిలిచారన్నారు. ఈ సంవత్సరం 67 మందికి మొదటి ర్యాంకు రావడంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి ఆందోళన వ్యక్తమవుతుందన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

• నర్సంపేట టౌన్: నీట్ పేపర్ లీకేజీపై జ్యుడిషియల్ విచారణ జరిపించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యార ప్రశాంత్ మాట్లాడుతూ కేంద్రం అసమర్థత వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని, వెంటనే జ్యుడిషియల్ విచారణ జరిపించాలని, సక్రమంగా ఏ పరీక్షను నిర్వర్తించలేని ఎన్‌టీఏను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివరాత్రి అనిల్, రాకేష్, తరుణ్, కిరణ్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీని విజయవంతం చేయాలి

చెన్నారావుపేట జూన్ 19 : నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంను విజయవంతం చేయాలని డాక్టర్ సరోజ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నట్టల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాలు ఉన్న పిల్లలకు నట్టలు ఉండటం వలన ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తలేమి సమస్యలతో బాధ పడడం ఉంటుందన్నారు. పిల్లల ఎదుగుదలలో మార్పు ఉంటుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అంగన్‌వాడీ సెంటర్‌ల్లో నట్టాల నివారణ మందులను పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్ రామెల్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నట్టల నివారణ మాత్రలు పంపిణీ

దుగ్గొండి : మండలంలోని అన్ని ప్రభుత్వ, అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు గురువారం నట్టల నివారణ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని దుగ్గొండి వైద్యాధికారి కిరణ్‌రాజు బుధవారం తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పిల్లలకు పంపిణీ అయ్యేవిధంగా సహకరించాలని కోరారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



గిర్నిబావిలో పాల్గొన్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



రాయపర్తిలో జన్మదిన వేడుకలో పాల్గొన్న నాయకులు

వర్ధన్నపేట, జూన్ 19 : అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం వర్ధన్నపేట పట్టణ అధ్యక్షుడు మైస సురేష్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆంగోత్ అరుణ, సమ్మెట సుధీర్, తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, నరుకుడు వెంకటయ్య, సిలువేరు శ్రీధర్, భీమానాయక్, గుడిబోయిన సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మండలంలోని ఇల్లందలో ఘనంగా నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న, గుంటి కుమారస్వామి, గడ్డం సమ్మయ్య, మల్లెపాక సమ్మయ్య, బాబు, సాయికుమార్, బుచ్చిమల్లు పాల్గొన్నారు.

• రాయపర్తి : కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో తొర్రూరు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యనాయక్, మైనార్టిసెల్ అధ్యక్షుడు ఎమ్డీ.అఫ్రోజ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుగులోత్ శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షుడు మచ్చ కుమారస్వామి, రాయపర్తి టౌన్ అధ్యక్షుడు మచ్చ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన కేక్‌ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబు కట్ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నునావత్ జయరాం నాయక్, దంజ్యానాయక్, భరత్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

• పర్వతగిరి : ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్‌చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, నాయకులు కూసం రాంచందర్, సునీల్‌రావు, కందికట్ల అనీల్, దారం పూర్ణచందర్, సతీష్‌రావు, నీరటి ప్రశాంత్, ఓరుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

• సంగెం: మండలంలోని మొండ్రాయిలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు, లోక్ సభ ఫ్లోర్ లీడర్ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఏఐపీసీ తెలంగాణ మెంబర్ పోశాల నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చెవ్వ మొగిలి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అనుముల కుమారస్వామి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మడత కేశవులు, గ్రామ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికి యాకయ్య, నీరటి కుమారస్వామి, ఉపాధ్యక్షుడు చిరంజీవి, అనుముల ఆదర్శ, కుమారస్వామి, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ పార్టీ అధికార ప్రతినిధి జనగాం రమేష్, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మడత కేశవులు, మెట్టుపల్లి రమేష్, నాయకులు కందకట్ల నరహరి, రాజు, ఇండ్ల రవి, పులి సాంబయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం : ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం అశోక్‌నగర్‌లో డీసీసీ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎల్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయం సాక్షిగా..

విద్యార్థులను కూలీలుగా చేసిన విద్యాశాఖ!

నర్సంపేట టౌన్, జూన్ 19 : విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలలకు అందించే నూతన పుస్తకాల సరఫరాకు విద్యార్థులే దిక్కయ్యారు. విద్యార్థులనే విద్యాశాఖ అధికారులు కూలీలుగా వేలాది పుస్తకాలను మోయిస్తున్నారు. విద్యార్థులచే పుస్తకాలను మోయించడాన్ని స్థానికులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వివరాలిలావున్నాయి. నర్సంపేట మండలం, పట్టణంలోని వివిధ ప్రభుత్వపాఠశాలల విద్యార్థులకు అందించే పుస్తకాలు నర్సంపేట మండల విద్యాశాఖ కార్యాలయాల్లో సిద్ధంగా ఉన్నాయి. బుధవారం ఉదయం పట్టణంలోని హనుమాన్ దేవల్, బాలికల ఉన్నత పాఠశాల (కో-ఎడ్యుకేషన్)ల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసేందుకు ఆ పాఠశాల విద్యార్థులను ఎంఈవో కార్యాలయానికి అధికారులు తీసుకొచ్చారు. ఉక్కపోతలో విద్యార్థులతో పుస్తకాలను మోయించి వ్యాన్‌లోకి లోడ్ చేయించారు. కూలీలతో చేయించాల్సిన పనులను విద్యార్థులతో చేయించడంపై విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ ఎంఈవో రత్నమాలను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



వ్యాన్‌లో పుస్తకాలను లోడ్ చేస్తున్న విద్యార్థి

గుండెపోటుతో హోంగార్డు మృతి



రాములు(ఫైల్)

వర్ధన్నపేట రూరల్, జూన్ 19 : గుండెపోటుతో హోం గార్డు మృతి చెందిన సంఘటన మండలంలోని కట్ర్యాలలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న రాయపు రపు రాములు కట్ర్యాలలో విధులు నిర్వర్తిస్తుండగా గుండె పోటుకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతిచెందాడు.

ద్విచక్రవాహనాలు ఢీ..

• ఇరువురికి గాయాలు

పర్వతగిరి, జూన్ 19 : ద్విచక్రవాహనాలు ఢీకొని ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలోని అనంతారం గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గోపనపెల్లి గ్రామానికి చెందిన గుండమల్ల సందీప్ తన ద్విచక్ర వాహనంపై వరంగల్‌కు వెళ్తుండగా అనంతారం గ్రామానికి చెందిన మేకిరి దేవేందర్ లిఫ్ట్ అడగడంతో అతడిని ఎక్కించుకున్నాడు.ఈ క్రమంలో వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బొమ్మెర రమేష్ తన ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో సందీప్, దేవేందర్‌లకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సందీప్ తండ్రి రాజమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కూలిన రేకుల ఇల్లు



చెన్నారావుపేట, జూన్ 19 : మండలంలోని కాల్‌నాయక్ తండాలో గాలి వానబీభత్సంతో రేకుల ఇల్లు కూలిన సంఘటన మంగళవారం రాత్రి వెలుగు చూసింది. గ్రామస్థుల కథనం ప్రకారం... ఇదే తండాకు చెందిన జరుపుల తారోని ఇంటి రేకులు గాలివానకు కూలిపోయాయి. అధికారులు ఇంటిని పరిశీలించి తక్షణ సాయంను అందించాలని, అలాగే ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఖానాపురం, జూన్ 19 : చినుకుపడితే చిత్తడిగా మారుతున్న రోడ్లతో గ్రామస్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలోని ప్రధాన రహదారిపై వాటర్ ట్యాంకు, పోచమ్మగుడి సమీపంలోని ప్రధాన రోడ్డు అధ్వాన్నంగా మారడంతో కొద్ది పాటి వర్షానికే వరద నీరు రోడ్డుపై నిలిచి కుంటను తలిపిస్తుంది. దీంతో వాహనదారులు, పాదచారుల రకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు తగ్గినా మడుగు అలాగే ఉండి బురదమయం కావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు అటువైపు దృష్టి సారించి రోడ్డుపై నీరు నిలువకుండా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జిల్లాకే ఆదర్శం వర్ధన్నపేట మహిళలు



మహిళలను సన్మానిస్తున్న కౌసల్యాదేవి

వర్ధన్నపేట రూరల్, జూన్ 19 : ఏపీసీ, స్టిచ్చింగ్ సెంటర్లు, మార్కెటింగ్‌లో వర్ధన్నపేట మహిళలు జిల్లాకే ఆదర్శంగా ఉన్నారని డీఆర్‌డీవో కౌసల్యాదేవి అన్నారు. బుధవారం మండలంలోని ఇల్లంద, ల్యాబర్తి గ్రామాల మహిళలను డీఆర్‌డీఏ కార్యాలయంలో సన్మానించి, మాట్లాడారు. మండలసమాఖ్య అధ్యక్షురాలు ఎడ్ల అరుణ, ఏపీఎం వేణు నేతృత్వంలో ల్యాబర్తి అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సునీత పాఠశాల అభివృద్ధి పనులను జిల్లాలోనే మొదటి సారిగా పూర్తిచేయడమే గాకుండా తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వపాఠశాలలో చేర్పించారన్నారు. స్కూలు విద్యార్థుల యూనిఫాంలు కుట్టించి ఇవ్వడంలో జిల్లాలోనే ఐదవ స్థానంలో నిలిచారని, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఏడీఆర్‌డీఏ రేణుకారెడ్డి, డీపీఎంలు, దయాకర్, భవాని, అనిత, ఏపీఎంలు ధర్మేందర్, సుధాకర్, శ్రీనివాస్, సీసీలు గోలి కొమురయ్య, మంజుల, సురేష్ పాల్గొన్నారు.



కరీంనగర్‌లో మంత్రి బండి సంజయ్‌ని గజమాలతో సన్మానిస్తున్న నర్సంపేట బీజేపీ నాయకులు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని సన్మానించిన బీజేపీ నాయకులు

నర్సంపేట, జూన్ 19 : కరీంనగర్ ఎంపిగా విజయం సాధించి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించాక మొట్టమొదటిసారి కరీంనగర్‌కు బుధవారం వచ్చిన సందర్భంగా బండి సంజయ్‌కుమార్‌ను నర్సంపేటకు చెందిన బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్‌కు చేరుకున్న మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ప్రభబండ్లతో స్వాగతంపలికి ర్యాలీలో పాల్గొన్నానన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమతో కలిసి గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపామన్నారు. కార్యక్రమంలో బీజేపి నర్సంపేట పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ శీలం రాంబాబు, కౌన్సిలర్లు జుర్రురాజు యాదవ్, కవిత వీరన్న, బోడ గోల్యానాయక్, నల్లబెల్లి మండల కమిటీ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఖానాపురం మండల పార్టీ అధ్యక్షుడు ఆబోతురాజుయాదవ్, మహ్మదాపురం సొసైటీ అధ్యక్షుడు పాలగుల జీవన్, బీజేపీ యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిస కావొద్దు

చెన్నారావుపేట, జూన్ 19 : విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు బానిసకావొద్దని ఏఎస్సై లక్ష్మణమూర్తి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే భవిష్యత్ నాశనమవుతుందన్నారు. ప్రతీ విద్యార్థి చదువుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అండెం కార్డకర్‌రెడ్డి, కానిస్టేబుల్ రమేష్, ఆగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ స్కూల్స్‌పై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

నర్సంపేట టౌన్, జూన్ 19 : నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూల్స్‌పై అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నర్సంపేట పట్టణంలో ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో విద్య మాట్లాడుతూ నర్సంపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లను తొమ్మిది బ్యాచ్‌లుగా చేసి మూడు రోజులు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పూర్తిగా శిక్షణపొందిన టీచర్స్‌తో ప్రీ స్కూల్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మూడు నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అనంతరం ప్రియదర్శిని పూర్వ ప్రాథమిక వాచకం-1, పూర్వ ప్రాథమిక విద్యా కరదీపికలను అందజేశారు. ఈ కార్యక్రుమంలో సూపర్‌వైజర్ ఝాన్సీ, కె. మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

రీల్స్‌పై మోజుతో సూసైడ్‌ను సెల్ఫీ వీడియో చేసే క్రమంలో బిగిసిన ఉచ్చు?

అనుమానాస్పద మృతిగా విచారణ చేపట్టిన పోలీసులు

నర్సంపేట టౌన్, జూన్ 19 : ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య కు పాల్పడిన ఘటన నర్సంపేట పట్ట ణంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. యువకుడి మృతిపై కుటుంబ సభ్యులు అనుమా నాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలిలావున్నా యి. నర్సంపేట కుమ్మరికుంటకాలనీకి చెందిన కందికట్ల దేవమ్మ-యాకయ్యల కుమారుడు అజయ్(24) పట్టణంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవిస్తున్నాడు. మల్లంపల్లిరోడ్‌లో నివాసం ఉంటున్న తన సోదరి చెరుపెల్లి స్వాతి ఇంటికి మంగళవారం రాత్రి వెళ్లాడు. స్వాతికి అనారోగ్యంగా కారణంగా కుమ్మరికుంట కాలనీలోని తల్లి ఇంటికి వెళ్లిపోయింది. ఉదయం తిరిగి తన ఇంటికివచ్చి చూడగా లోపల నుంచి తలుపు గడియపెట్టి ఉండడం, తమ్ముడు అజయ్‌ని ఎంత పిలిచినా పలకకపోవడంతో అనుమానంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు పగలగొట్టారు. లోపలికివెళ్లి చూడగా దూలానికి చున్నీతో ఆత్మహత్య చేసుకొని కనిపించడంతో కన్నీటి పర్యంతమయ్యారు. విషయాన్ని నర్సంపేట పోలీసులకు తెలియజేయడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమారంనకు తరలించారు. తన కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ మృతుడి తల్లి దేవమ్మ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రమణమూర్తి తెలిపారు.



అజయ్ (ఫైల్)

రీల్స్ కోసం సూసైడ్‌ను సెల్ఫీ వీడియో చేస్తూ..?

అజయ్ ఆత్మహత్యపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అజయ్‌కి రీల్స్ చేసే అలవాటు ఉందని, ఎవరితో ఎలాంటి గొడవలు, ఇతరత్రా సమస్యలేవీ లేవని చెబుతున్నారు. రీల్స్‌పై ఉన్న మోజుతో సోషల్ మీడియాలో వైరల్ కావాలని, ఆత్మహత్యను సెల్ఫీ వీడియో తీసి రీల్స్ చేద్దామని భావించగా, ప్రమాదవశాత్తు ఉచ్చు బిగుసుకుని మృతిచెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సెల్ఫీ తీసుకునే క్రమంలో కాలు కింద ఉన్న కుర్చీ పక్కకు జరిగి, ఉచ్చు బిగిసుకొని ఉండవచ్చని, ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మృత్యువాత పడ్డాడని భావిస్తున్నారు.

బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న సోల్తి సారయ్యగౌడ్

నర్సంపేట, జూన్ 19 : చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు సోల్తిసారయ్యగౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘం కారాలయంలో బుధవారం విలేఖరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల శాతం పెంచకపోవడం వల్ల బీసీలు విద్య, ఉపాధి. రాజకీయ తదితర రంగాలలో అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ రిజర్వేషన్లను పెంచాలని గత కొన్నేళ్ళుగా కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. కుల గణను వెంటనే చేపట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కులగణన పూర్తి చేస్తే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకల వల్ల విద్యార్థినీ. విద్యార్థులు నష్టపోయారని, నీట్‌ను రద్దుచేసి మళ్ళీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యపై త్వరలో సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్య క్రమంలో బీసీ సంక్షేమ సంఘం డివిజన్ ప్రధానకార్యదర్శి సాంబరాతి మల్లేశం తదితరులు పాల్గొన్నారు..

పరిస్థితులకు అనుగుణంగా పంటలసాగు చేపట్టాలి



భట్టుతండాలో పత్తిపంటను పరిశీలిస్తున్న డీఏవో ఉష

పర్వతగిరి, జూన్ 19: ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలసాగు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉష అన్నారు. బుధవారం మండలంలోని ఏనుగల్లు, ఎస్‌జీ. తండా, భట్టు తండా గ్రామాల్లో సాగుచేసిన వరి, పత్తి పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో మధ్యకాలిక రకాలను సాగుచేసుకోవాలని,పచ్చిరొట్ట పైరుగా జీలుగ, పెసర పంటలను సాగుచేసుకోవాలన్నారు. పత్తి పంటలకు గాను భూమిలో వేడిబయటకు వెళ్లిన తరువాతే పత్తి విత్తనాలను వేసుకోవాలన్నారు. ఇప్పటికే వేసుకున్న రైతులు మొలకలురాని చోట మళ్లీ విత్తుకోవాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటలసాగు చేపట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ వి.సారంగం, మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కొత్తగూడ, జూన్ 19 : బస్సు ద్విచక్రవాహనం ఢీకొనగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కొత్తగూడ-చిలకమ్మనగర్ గ్రామాల మధ్యలోని గువ్వల బోడు వద్ద బుధవారం జరిగింది. వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా ఖానాపురం మం డలం చిలకమ్మనగర్ గ్రామానికి చెందిన జర్పుల సుమన్, అజ్మీరా అనిల్ చిలకమ్మనగర్ నుంచి కొత్తగూడకు వస్తున్నారు. నర్సంపేట డిపోకు చెందిన బస్సు ముస్మి నుంచి నర్సంపేటకు వెళుతుంది. కొత్తగూడ దాటిన తరువాత గువ్వలబోడు వద్ద బస్సు ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. జర్పుల సుమన్, అజ్మీరా అనిల్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108లో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.